

ప్రజాసమస్యలను అలక్ష్యం చేయొద్దు

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్యాలయాలకు వచ్చే అర్జీదారుల సమస్యలను అలక్ష్యం చేయొద్దని అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున అర్జీదారులు పాల్గొని తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. వారి బాధలు సావధానంగా వింటూ తదుపరి చర్యలకై సంబంధిత అధికారులతో మాట్లాడుతూ తక్షణ చర్యలకై కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫిర్యాదుదారుల అర్జీలను సంబంధిత అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం ఉండాలన్నారు. గడువులోగా పరిష్కారాలు అందజేయాలన్నారు. ఎవరైనా అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం పీజీఆర్ఎస్ అర్జీల పెండింగ్‌పై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీ వెంకటపతి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై ప్రత్యేకదృష్టి : ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడంలో ప్రత్యేక దృష్టి సారించలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 223 ఫిర్యాదులు పీజీఆర్ఎస్‌కు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ ఫోనులో మాట్లాడారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్టపరిధిలో పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, మహిళా పీఎస్ డీఎస్పీ ఇ.బాలస్వామి రెడ్డి, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజరుకు స్థానచలనం


కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజరు సి.నీలకంఠారెడ్డికి స్థానచలనం కలిగింది. ప్రకాశం జిల్లాలోని డీఆర్‌డీఏకు ఆయనను అదనపు ప్రాజెక్టు డైరెక్టరుగా నియమిస్తూ సెర్ప్ సీఈవో కరుణా వాకాటి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయనను రిలీవ్ చేయాలని కడప డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు.

ఏడు మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పెండింగులో ఉన్న ఏడు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-26 సంవత్సరానికి సంబంధించి జనరల్ కేటగిరీలో 5 షాపులు, గీత కులాలకు రెండు షాపులకు ఈ నెల 10న సాయంత్రం ఐదుగంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 12వ తేదీ ఉదయం 8గంటలరకు లాటరీ ద్వారా ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

క్రికెట్‌లో కడప తేజం





ప్రపంచ కప్‌ను ముద్దాడుతున్న శ్రీచరణి

- మహిళా ప్రపంచకప్‌లో శ్రీచరణి ప్రతిభ
- 9మ్యాచుల్లో 12వికెట్లు
- ప్రపంచకప్ విజయంతో ఆర్టీపీపీలో సంబరాలు
- నాడు నాన్న వద్దన్నా.. పట్టుదలతో క్రికెట్‌లోకి ఎంట్రీ
- నేడు ప్రపంచానికి సత్తాచాటింది

కడప / ఎర్రగుంట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వీఎన్‌పల్లె మండలం యర్రబల్లెకు చెందిన నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక దంపతులకు వైష్ణవి, శ్రీచరణి కుమార్తెలు. చంద్రశేఖర్‌రెడ్డి 1992లో ఆర్టీపీపీ కోల్‌ప్లాంట్‌లో ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్ ఫోర్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడే పుట్టిన శ్రీచరణి 10వ తరగతి వరకు డీఏవీ స్కూల్‌లో చదివింది. చిన్నప్పటి నుంచి ఆటలంటే ప్రాణం. అయితే కోకో, కబడ్డీ తర్వాత అథ్లెటిక్స్‌లో మంచి ప్రావీణ్యం చూపించింది. 9వ తరగతి నుంచి క్రికెట్ అంటే ప్రేమ పెంచుకుంది. ఎలాగైనా క్రికెట్‌లో రాణించాలని పట్టుదలను రెట్టింపు చేసుకుంది. అయితే తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి ఆటలకన్నా చదువులో రాణించాలని చెప్పేవాడు. క్రికెట్ వద్దని తండ్రి వారించాడు. అయితే, మేనమామ నచ్చచెప్పి ఆయనను ఒప్పించారు. కడపలోను, హైదరాబాదులో ఇంటర్ చదువుతూ కోచ్ సురేశ్ వద్ద శిక్షణ పొందింది. తరువాత మంగళగిరిలో శ్రీనివాసరెడ్డి కోచింగ్‌తో మరింత రాటుతేలింది. శ్రీచరణి తొలుత ఫాస్ట్‌బౌలర్‌గా క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత స్పిన్ బౌలింగ్‌ను ప్రయత్నించింది. ఈ బౌలింగ్‌లో వికెట్లు పడడంతో ఆమె లెఫ్ట్‌టర్న్ స్పిన్నర్‌గా మారిపోయింది. అండర్ 19లో, తరువాత ఉమెన్స్ టీ20లోను, శ్రీలంక మ్యాచ్‌లకు ఎంపికైంది. రెండు సంవత్సరాల్లోనే ఉమెన్స్ ప్రీమియర్‌లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆడి రాణించడంతో సెలక్టర్లను ఆకర్షించింది. అనంతరం ప్రపంచకప్ ప్రాబబుల్స్‌లో తన పేరును ఎంపిక చేయడంతో శ్రీచరణి దశ తిరిగింది. ఇక వరల్డ్ కప్‌లో జరిగిన 9 మ్యాచ్‌లలో 12 వికెట్లు సాధించింది. శ్రీచరణి వరల్డ్ కప్ ప్రారంభం నుంచి మంచి ప్రతిభ కనపరచింది. ముఖ్యంగా ఆస్ట్రేలియా మ్యాచ్‌లో రెండు కీలక వికెట్లు తీసి ప్రపంచ క్రికెట్ అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించింది. ప్రపంచకప్ సాధించిన జట్టులో శ్రీచరణి కీలక భూమిక పోషించడంతో ఆర్టీపీపీలో సంబరాలు చేసుకుంటున్నారు.

కడప అంటే ఇప్పటిదాకా ఫ్యాక్షన్, అరుదైన ఖనిజాలు, చారిత్రక ఆలయాలు, వారసత్వ సంపద గురించి తెలుసు. ఇప్పుడు క్రికెట్ అంటే కూడా కడప గుర్తొస్తుంది. క్రేజీ ఆట క్రికెట్‌లోకి మన కడప అమ్మాయి శ్రీచరణి ఎంట్రీ అయింది. మహిళా ప్రపంచ కప్ అనేది మన జట్టుకు ఐదు దశాబ్దాలుగా అందని ద్రాక్షలా ఉంది. ఈ సారి హేమాహేమీలైన జట్లతో తలపడి ఓడించి సగర్వంగా వరల్డ్‌కప్‌ను గెలుచుకుంది. అలాంటి ప్రపంచకప్ గెలుపులో కడప ముద్దుబిడ్డ శ్రీచరణి భాగస్వామ్యం కావడంతో ఒక్కసారిగా కడప గడప పులకించిపోయింది. ప్రపంచకప్‌లో శ్రీచరణి లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా అద్భుతంగా రాణించింది. ఆడిన 9 మ్యాచుల్లో 12వికెట్లు తీసుకుంది. కీలకమైన సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 49 పరుగులిచ్చి ఫైనల్‌కు వెళ్లేందుకు కీలకపాత్ర పోషించింది.

ఆ దేవుడిని ఇంతకన్నా ఏమీ కోరుకోను

– చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీచరణి తండ్రి



మొదట్లో నేను క్రికెట్ వద్దన్న మాట నిజమే కానీ.. పట్టుదలతో ముందుకెళ్లి నేడు ప్రపంచకప్‌లో బాగారాణించి, ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. ఇంతకన్నా మాకేం కావాలి.. ఆదేవుడిని అంతకన్నా ఎక్కువ ఏమీ కోరుకోను. భవిష్యత్తులో కూడా నాబిడ్డ బాగా రాణిస్తుంది. ప్రపంచకప్ మ్యాచ్‌లలో తోటి క్రీడాకారిణిలు, కెప్టెన్ సహకారం ఎంతగానో ఉంది. మా పెద్దమ్మాయి వైష్ణవి అమెరికాలో ఉద్యోగం చేస్తోంది. ముంబైలో మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తిలకించేందుకు అమెరికా నుంచి వచ్చింది.

తల్లిదండ్రులు నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రేణుకతో శ్రీచరణి

శివోహం

● శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు





మృత్యుంజయకుంటలో ప్రత్యేక అలంకారంలో స్వామివారు



ఖాజీపేట: నాగనాథేశ్వరుడిని దర్శించుకునేందుకు క్యూలో వేచిఉన్న భక్తులు



కడప కల్చరల్ /ప్రొద్దుటూరు టౌన్ / ఖాజీపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా జిల్లాలోని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపాలతో ఆలయాలు కొంగ్రొత్త శోభతో దేదీప్యమానంగా ప్రకాశించాయి. భక్తులు శివనామ స్మరణ గావిస్తూ భక్తిభావంతో ఉపవాసాలు చేశారు. ప్రతీ ఆలయంలోనూ విశేష అభిషేకాలు, పూజలు, వ్రతాలు, నోములు, అన్నదాన కార్యక్రమాలు, చేపట్టారు.

రామేశ్వరంలో..

ప్రొద్దుటూరు రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

నాగనాథేశ్వర కోనలో

కార్తీక మాసం రెండవ సోమవారం పురస్కరించుకుని ఖాజీపేట మండలంలోని నాగనాథేశ్వరుడికోనలో వెలసిన నాగనాథేశ్వరుడి దర్శనానికి భక్తులు బారులు తీరారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు కొండ కిందిబాగంలో భారీగా అన్నదానం చేపట్టారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ట్రాఫిక్‌కు అంతరాయం ఎదురవ్వకుండా క్యూలైన్లలో తొక్కిసలాట జరుగకుండా సీఐ వంశీధర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండ కింది భాగంలో బండలాగుడు పోటీలు నిర్వహించి ఆరు జతల వృషభరాజములకు నగదు బహుమతిని మాజీ ఆలయ చైర్మన్ ఆదినారాయణరెడ్డి అందజేశారు.



కడప మృత్యుంజయకుంట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసుల పంజా

- అదుపులో బెట్టింగ్ నడిపిస్తున్న క్రైంపార్టీ కానిస్టేబుల్?
- విచారిస్తున్న ప్రొద్దుటూరు టూటౌన్ పోలీసులు
- ఇప్పటికే అదుపులో ఆరుగురు బుకీలు
- మరో నలుగురి కోసం గాలింపు



ప్రొద్దుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో చాపకింద నీరులా క్రికెట్ బెట్టింగ్ సాగుతోంది. సెల్‌ఫోన్ నుంచే ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌ను కొందరు బుకీలు నడిపిస్తున్నారు. గతంలో ప్రొద్దుటూరు త్రీటౌన్, టూటౌన్ పోలీసు స్టేషన్లలో పనిచేసి ప్రస్తుతం మైదుకూరు అర్బన్ పోలీసు స్టేషన్లో పనిచేస్తున్న క్రైంపార్టీ కానిస్టేబుల్ ఈ బెట్టింగ్ వ్యవహారంలో కీలకంగా ఉన్నట్లు సమాచారం. ఈ కానిస్టేబుల్‌ను ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీసులు విచారిస్తున్నారు. కానిస్టేబుల్ కాల్ లిస్టు బయటికి తీయడంతో.. తీగలాగితే డొంకంతా కదిలినట్లు ఆ సెల్‌ఫోన్‌లో లావాదేవీలు బయట పడినట్లు ప్రచారం జరుగుతోంది. ఇతనే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌ను నడిపిస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

కాగా ఆదివారం మైదుకూరు రోడ్డులోని ప్రతాప్ లాడ్జికి వెళ్లే దారి మొదట్లో ఉన్న ఒక టీ బంకులో కూర్చొని ఒక వ్యక్తి సెల్‌ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతుండగా పక్కన ఉన్న కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో టూటౌన్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అలాగే మైదుకూరు రోడ్డులో టీటీడీ కల్యాణమండపం ఎదురుగా రుచులు హోటల్ నడుపుతున్న కోటవీధికి చెందిన వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి సెల్‌ఫోన్లలో ఆ క్రైం పార్టీ కానిస్టేబుల్ నెంబరు ఎక్కువగా కాల్‌లిస్టులో కనబడింది. దీంతో ఈ నెట్‌వర్కునంతా ఛేదించడానికి పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆరుగురిని పట్టుకున్నారు. మరో నలుగురు కీలక బుకీలను పట్టుకోవడానికి ఈ ఆపరేషన్‌ను సీక్రెట్‌గా నడిపిస్తున్నారు.

గాంధీరోడ్డు సుందరాచార్యుల వీధిలోని ఒక హోటల్ నిర్వాహకుడు కూడా గుట్టుచప్పుడు కాకుండా క్రికెట్ బెట్టింగ్ సాగిస్తున్నాడని సమాచారం. ఇతనికి జిల్లాలోనే బడా బుకీగా పేరుంది. ఇతను ఇటీవల ఒక కానిస్టేబుల్ ద్వారా ఆ ఏరియా పరిధిలోని ఒక పోలీసు అధికారికి మామూళ్ల కింద రూ.5 లక్షలు అందజేసినట్లు చెబుతున్నారు. అందువల్ల ఈ స్టేషను పరిధిలో బుకీలపై దృష్టి సారించలేదని ప్రచారం సాగుతోంది. కానీ డీఎస్పీ ఈ బెట్టింగ్ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అందులో భాగంగా ఆ క్రైం పార్టీ కానిస్టేబుల్‌ను డీఎస్పీనే తన కార్యాలయంలో ఉంచి విచారిస్తున్నారు. పోలీసులు రెండు రోజుల్లో ఈ బెట్టింగ్ ఆపరేషన్ పూర్తిచేసి నిందితులను మీడియా ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం.

పెద్దదర్గా ఉరుసుకు ఆర్టీసీ బస్సులు

కడప మారుతీనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని 5వ తేదీ బుధవారం నుంచి 9 వ తేదీ వరకూ జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడపలో రైల్వేస్టేషన్ నుంచి పెద్దదర్గాకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. 5న గంధం మహోత్సవాలకు, 6న జరుగనున్న ఛాదర్ కార్యక్రమానికి, 9న జులూస్ (మెరవణి) కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. 9న పెద్ద దర్గానుంచి వాటర్‌గండి వరకూ కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. 5, 6, 9 తేదీలలో మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల డిపోల నుంచి ఉరుసుకు హాజరయ్యే భక్తుల రద్దీని బట్టి కడప వరకూ అదనపు సర్వీసులు తిప్పుతామన్నారు.

కార్తీక పౌర్ణమి రోజున..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 5వ తేదీ బుధవారం జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలైన పొలతల, నిత్యపూజకోన, పుష్పగిరి, కన్యతీర్థం, అగస్త్యేశ్వరకోనకు జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్ఎం తెలిపారు. ఆయా డిపోల నుంచి పోవడానికి, తిరిగి రావడానికి ఉదయం నుంచి సాయంత్రం వరకూ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

గుర్రంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారం , వెండి ఆభరణాలు అపహరించుకు వెళ్లిన సం ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని కొత్తపేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న వసీమ్ అక్రమ్ గత నెల 28న ఇంటికి తాళం వేసి బెంగుళూరుకు వెళ్లాడు. సోమవారం మ ధ్యాహ్నం తిరిగి వచ్చిన అతను తాళం పగులగొట్టి ఉండడం గమనించాడు. దీంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా పగిలిపోయి.. అందులోని దుస్తులు చిందర వందరగా పడి ఉండడం కనిపించింది . బీరువాలోని అరలను ఇనుప రాడ్డుతో ధ్వంసం చేసి అందులోని 10 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి ఆభరణాలను తీసుకెళ్లినట్లు గుర్తించాడు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలి ముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ గజేంద్ర తెలిపారు.

బాలిక అదృశ్యం

రామసముద్రం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎలవానెల్లూరు పంచాయతీ ఎ.కొత్తూరు గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమేశ్‌బాబు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవంబరు 2వ తేదీ నుంచి ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదని పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేరు కాపురం పెట్టలేదని మహిళ ఆత్మహత్య

రాయచోటి-నేతాజీ సర్కిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేరుకాపురానికి భర్త అంగీకరించలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవపట్ల గ్రామం అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన దేవరింటి కన్నయ్య నాలుగో కూతురు మౌనిక (25)కు రెండేళ్ల క్రితం కడప జిల్లా అట్లూరు మండలం ఎస్. వెంకటాపురానికి చెందిన సునీల్‌తో వివాహమైంది. వీరికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. వేరు కాపురం విషయమై భర్తతో గొడవపడిన మౌనిక రెండు నెలల క్రితం పుట్టింటికి చేరుకుంది. ఆదివారం ఆమె వాంతులు చేసుకోవడంతో గుర్తించిన తల్లిదండ్రులు విషం తాగినట్లు గుర్తించి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని, ఈ మేరకు మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

స్థలం వివాదంలో.. ఇరువర్గాలకు కౌన్సెలింగ్

రైల్వేకోడూరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో రెండు వర్గాలు ఘర్షణ పడడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కోడూరు పట్టణంలోని సర్వే నెంబర్లు 5,7,13 ను కొందరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అదే సర్వే నంబర్లు సుమారు 100 మందికి పైగా రిజిస్ట్రేషన్ అయ్యాయి. అయితే, దళిత వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఆర్‌ఎస్‌ఆర్‌లో తమ పూర్వీకుల పేర్లు ఉన్నాయని ఆ భూమి తమకే చెందుతుందంటూ ఇతరులను ఈ స్థలం వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయంపై రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. దీంతో సోమవారం స్థలం వద్దకు వెళ్లిన వారిపై దళిత వర్గానికి చెందినవారు దాడి చేయడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కే.అమర్నాథ్, సీఐ కే.హేమసుందర్ రావు ఇరువర్గాల వారిని కోడూరు తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇరువర్గాల వారిని బైండోవర్ చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

17 నుంచి కుష్ఠువ్యాధిపై సర్వే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు3(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి పై ప్రజల్లో అపోహలను తొలగించడంతోపాటు, బాధితులకు చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30 వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి బాధితులను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగవైకల్య నివారణకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రాథమిక దశలనే బాధితులను గుర్తించి వైద్య సేవలు అందిస్తే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరికీ కుష్ఠువ్యాధి పరీక్షలు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య, జిల్లా టీబీ అధికారి రాధిక, మెడికల్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచాలి: జేసీ

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు3(ఆంధ్రజ్యోతి): రైతులకు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచాలని, వ్యవసాయంలో పీ4 అమలు చేసి ఆదర్శ రైతులను మార్గదర్శకులుగా చూపించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో భూమాత రక్షణ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యసాయాఖ అధికారి కార్యక్రమంలోని వివిధ అంశాలను వివరించారు. భూసారం పెంపు, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, రైతుల్లో సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గించడంపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ, భూమాత రక్షణ కార్యక్రమం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మీరైనా పట్టించుకోండి మేడం

- పరిహారం చెల్లింపులో జాప్యంపై భూ నిర్వాసితుల వినతి



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ కళ్యాణి

మదనపల్లె టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అవసరాలకోసం సేకరించిన భూమికి సంబంధించి నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నారు.. మీరైనా పట్టించుకుని న్యాయం చేయండి మేడం అంటూ పలువురు రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి ఆధ్వర్యంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. పీటీఎం మండలంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ కోసం సేకరించిన భూములకు నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్నారని కందుకూరుకు చెందిన సాబ్‌జాన్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం కోటవారిపల్లె పంచాయతీలో డంపింగ్ యార్డు నిర్మాణానికి తాను రూ.65,275 ఖర్చు చేయగా అధికారులు రూ.37,768 మాత్రమే చెల్లించారని, మిగిలిన సొమ్ము కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నానని.. సమస్య పరిష్కరించాలని సురేంద్ర అనే వ్యక్తి విన్నవించారు. మదనపల్లె పట్టణ శివారులో కొందరు నకిలీ ఇంటి పట్టాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మొంథా తుఫాను కారణంగా ములకలచెరువు మండలం సోంపల్లె వద్ద అడవిచెరువుకు గంగి పడి రోడ్డు కోసుకుపోయిందని, దేవలచెరువు రోడ్డు గుంతలమయమైందని, మరమ్మతులు చేయించాలని ఏఐకేఎంఎస్ అధ్యక్షుడు వైవీ రమణ సబ్‌కలెక్టర్‌ను కోరారు. వీటితో పాటు భూ సమస్యలు, సర్వే సమస్యలు, అంత్యోదయ కార్డుల కోసం ప్రజలు అర్జీలు సమర్పించారు. కాగా, సరోజిని అనే వృద్ధురాలు పీజీఆర్‌ఎస్ హాలుకు వచ్చి నడవలేక కూర్చుండిపోవడాన్ని గమనించిన సబ్‌కలెక్టర్ ఆమె వద్దకు వెళ్లి అర్జీని పరిశీలించి, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మోటకట్ల విద్యార్థులు



రాయచోటి - నేతాజీ సర్కిల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడా పోటీలకు మోటకట్ల హైస్కూల్ విద్యార్థులు 9 మంది ఎంపికయ్యారని హెచ్‌ఎం చప్పిడి పద్మజ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఆయా విద్యార్థుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాఫ్ట్‌బాల్ అండర్-14 విభాగం బాలికల్లో నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, మనోజ్, బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యారన్నారు. బేస్‌బాల్‌లో అండర్-14 బాలికల విభాగంలో మోక్షజ్ఞ, నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యారన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వేణుమాధవ్‌రాజును పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిదంబర్‌రెడ్డి, పద్మావతి, నాగశేషారెడ్డి, నాగేశ్వర్‌నాయక్, భాస్కర్, ప్రసాద్‌రాజు, నరసింహులు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

హైవే పనులకు రూ.85 కోట్ల నిధులు



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సన్మానిస్తున్న ముక్కా..

రైల్వేకోడూరురూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కడప - రేణిగుంట నేషనల్ హైవే నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్‌తో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారీ వర్షాల కారణంగా కడప-రేణిగుంట జాతీయ రహదారి తీవ్రంగా దెబ్బతిన్నదని, దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రోడ్డు పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని కోరగా తక్షణమే రూ.85 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు.

భద్రకాళి, వీరభద్రులకు వెండి కిరీటాలు అందజేత



వెండి వస్తువులను అందజేస్తున్న వీరయ్య కుటుంబ సభ్యులు

రాయచోటిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి సోమవారం పలువురు దాతలు వెండి కిరీ టాలు, వెండి వస్తువులు అం ద జేసినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలియజేశారు. కడప జిల్లా వేంపల్లికి చెందిన వడ్లకుంట వీరయ్య కుమారుడు రాచయ్య జ్ఞాపకార్థం రాజనరసింహారావు వీరభద్రస్వామికి 2.222 కేజీల వెండి నాగపడగతో కూడిన కిరీటం, వీవీఎల్‌ఎన్ రోహిత్ భద్రకాళి అమ్మవారికి 981 గ్రాముల వెండి జ్వాలా కిరీటం అందజేశారు. వంకదారి చంద్రశేఖరయ్య జ్ఞాపకార్థం వడ్లకుంట సుభాషిణి వీరభద్రస్వామి ఉత్సవ మూర్తికి 624 గ్రాముల వెండి కిరీటం, ఖడ్గం, 1, ఎడమ చేయి, పాదాలు, డాలు అందజేశారు. వడ్లకుంట విజయలక్ష్మి దేవమ్మ జ్ఞాపకార్థం వడ్లకుంట వైష్ణవి భద్రకాళీ అమ్మవారి ఉత్సవమూర్తికి 413 గ్రాముల వెండి కిరీటం, త్రిశూలం, ఎడమ హస్తం, పాదాలు అందజేశారు. మొత్తం మీద వడ్లకుంట వీరయ్య కుటుంబ సభ్యులంతా కలసి 4.240 కేజీల వెండి వస్తువులను సమర్పించారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు గాలివీడు విద్యార్థి



అయూబ్

గాలివీడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు గాలివీడు జడ్పీహైస్కూల్ విద్యార్థి మహమ్మద్ అయూబ్ ఎంపికైనట్లు పీడీ గంగరాజు, ప్రధానోపాధ్యాయుడు కే. జాఫర్‌హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉరవకొండలో నవంబర్ 2, 3 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీల్లో మహమ్మద్‌అయూబ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అనంతరం అయూబ్ ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించింది.

చిత్రజ్యోతి

SINCE 1965


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథా నాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టీప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హొంబలె ఫిల్మ్, మల్టీప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది



దీక్షిత్ శెట్టి

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

చకచకా... 'సోలార్' పనులు

- దువ్వూరు వద్ద పవర్‌ప్లాంట్ నిర్మాణం
- 5 మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన లక్ష్యం
- పూర్తయితే రైతులకు ప్రయోజనం



దువ్వూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంట పొలలకు అందించే కరెంటు సరఫరాలో తరచూ అవాంతరాలు ఎదురవుతున్నాయి. దీంతో పొలం పూర్తిగా తడవకముందే ఎదురవుతున్న ఆటంకాలతో అన్నదాతలు ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చొరవతో జిల్లాలో మైదుకూరు, పులివెందుల, కడప, పోరుమామిళ్ల క్లస్టర్లలో సోలార్ పవర్‌ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా దువ్వూరులో అయిదు మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన లక్ష్యంగా మెగా కంపెనీ పనులు చేపట్టింది.

దువ్వూరు సమీపంలోని గుట్టప్రాంతమైన సర్వే నంబరు 145లో 25 ఎకరాల ప్రభుత్వ స్థలంలో సోలార్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నాలుగు నెలల వ్యవధిలో ఈ పనులను పూర్తి చేసే విధంగా గడువు నిర్ణయించారు. ఇటీవల నెలకొన్న తుఫాను ప్రబావం పనులకు కొంత ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం ఈ పనులు ఊపందుకున్నాయి. రాయితీతో కూడిన గుట్ట ప్రాంతం కావడంతో మిషనరీని ఉపయోగించి సోలార్ ప్యానెల్స్ అమర్చేందుకు వీలుగా రంధ్రాలు వేస్తున్నారు. అయిదు అడుగుల లోతు, ఒక అడుగు వెడల్పుతో రంధ్రాలు ఏర్పరచి అలైన్‌మెంట్, కాలంపోస్టు పనులు చేస్తున్నారు. గత నెల 17వ తేదీన ఈ పనుల తీరుతెన్నులు పరిశీలించేందుకు తిరుపతి నుండి ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ ఇక్కడికి వచ్చారు. పనులు చేస్తున్న కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పవర్‌ప్లాంట్ నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజన కరంగా ఉంటుంది.

ముగిసిన జయంత్యుత్సవాలు



ఊరేగుతున్న గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 417 జయంతి మహోత్సవాలు సోమవారం ప్రత్యేక పూజలతో ముగిసాయి. ఉదయం సుప్రభాత పారాయణం, మండల పూజ, మధ్యాహ్నం నైవేద్య మహామంత్ర పుష్పం, ప్రసాద వినియోగం, సాయంత్రం 7గంటలకు భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో కార్తీక సహస్ర దీపార్చన, మహామంగళ హారతి నిర్వహించారు. తెల్లవారు జామున గ్రామవీధుల గుండా జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబ గ్రామోత్సవం నిర్వహించారు. శాశ్వత ఉభయదాతలు ఇడమకంటి జనార్దన శివాచార్య కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఉభయదారులు బాలబ్రహ్మచారి కుటుంబ సభ్యులు భక్తులకు ప్రసాదం అందించారు.

డిసెంబరు నాటికి కిచెన్ షెడ్లు పూర్తి చేయాలి : కలెక్టర్



వీసీ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ల నిర్మాణాలు డిసెంబరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్‌గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతిపై అన్ని డివిజన్ల ఆర్డీవోలు, సంబంధిత అధికారులతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ కడప నగరంలో, సీకేదిన్నెలో స్మార్ట్ కిచెన్‌ల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకాన్ని మరింత శుచిగా, రుచి కరంగా తాజాగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ స్మార్ట్ కిచెన్లు రాష్ట్రానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. ఇదే స్ఫూర్తితోనే జిల్లాలో నూతనంగా 33 స్మార్ట్ కిచెన్ షెడ్లను ఏర్పాటు చేస్తున్నామని, అందులో 23 స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని కూడా రెండు రోజుల్లో ప్రారంభించాలన్నారు. ఇందులో స్థల కేటాయింపు, ఇసుక కంకరకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్మార్ట్ కిచెన్లలో ఏర్పాటు చేసే పరికరాల కోసం టెండర్, కొనుగోలు మొదలైన అంశాలపై సమీక్షించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అందించే మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లో వంద శాతం మంది విద్యార్థులు తింటున్నారా.. లేదా.. అందులో నాణ్యత విషయమై తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను కూడా సేకరించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ పార్మింగ్ ఏర్పాటుకు మండలాల్లో సదుపాయాలను సమకూర్చాలన్నారు. కూరగాయల తోటల పెంపకం, కొనుగోలు సంబంధిత అంశాలపై ఏపీ ఈఎన్ఎఫ్, డీఆర్‌డీఏ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు హజరత్తయ్య, ఓబులమ్మ, షంషుద్దీన్, రాజ్యలక్ష్మి, ఆదిశేషారెడ్డి, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో 20 మందిపై కేసు నమోదు

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం హనుమాన్‌జంక్షన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన దాడిఘటనలో పరస్పర ఫిర్యాదుల మేరకు టీడీపీ, వైసీపీలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసిం హులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు అలిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న వైసీపీకి చెందిన రాఘవరెడ్డి, టీడీపీకి చెందిన గోపీనాథ్‌రెడ్డిలు సోషల్‌మీడియాలో పరస్పరం రెచ్చగొట్టే వ్యాఖ్యలు పెట్టేవారు. పరస్పరం ఫోన్‌లో సవాళ్లు విసురుకున్నారు. ఈక్రమంలో హనుమాన్ జంక్ష న్ వద్ద ఉన్న రాఘవరెడ్డి వద్దకు వచ్చి గోపీ నాథ్‌రెడ్డి దాడికి దిగారు. గాయపడ్డ రాఘవరెడ్డి కడపలో చికిత్స పొందుతున్నారు. రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు గోపీనాథ్‌రెడ్డితో పాటు మరో ఐదుగురిపై, అలాగే గోపీనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేర కు రాఘవరెడ్డితో పాటు 15 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అంజన్న పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల్లో హోమపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చక్రాయపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గండిక్షేత్రంలో కార్తీకమాసం పురస్కరించుకొని జరుగుతున్న పవిత్రో త్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, పాలక మండలిచైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. సోమవారం 2వ రోజు ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజారమేష్ నేతృత్వంలో తిరుమలకు చెందిన పండితులు బీవీ రామానుజాచార్యులు వారి శిష్య బృందంచే వేదమంత్రోచ్చారణతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకటస్వామి, సహాయ అర్చకులు రఘుస్వామి, వేదపారాయణదార్ రామ్మోహన్‌శర్మ పాల్గొన్నారు.

తమ్ముని చంపిన అన్న అరెస్టు



మాట్లాడుతున్న సీఐ రోషన్

కమలాపురం రూరల్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని అపాపరావుపల్లె గ్రామంలో ఆస్తి తగాదా విషయమై సొంత తమ్ముడినే హత్య చేసిన కేసులో అన్నను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ రోషన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు తెలి పారు. అప్పారావుపల్లె గ్రామంలో అక్టోబరు 30వ తేదీ సొంత తమ్ముడైన విశ్వనాథరెడ్డితో ఆస్తి సంబంధ విషయాలపై అన్న చెన్నారెడ్డి వాగ్వా దానికి దిగాడు. ఇరువురి మధ్య మాటా మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో తమ్ముడు విశ్వనాథరెడ్డిపై చెన్నారెడ్డి దాడి చేయడంతో తీవ్రగాయాలై అక్కడకక్కడే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బందితో ప్రత్యేక టీంలుగా ఏర్పడి సోమవారం మధ్యాహ్నం చెన్నారెడ్డిని గోపులాపురం క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశామని సీఐ తెలిపారు. ఆస్తి సంబంధ విషయాలు, ఇతర సమస్యలను అధికారులు లేదా కోర్టులను ఆశ్రయించి పరిష్కరించుకోవాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



రాజంపేట టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం బోయనపల్లెలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణం సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తాళ్లపాక ముఖద్వారం పక్కన 108 అన్నమయ్య విగ్రహం సమీపంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సంద్భంగా సాయంత్రం టీటీడీ ప్రధాన అర్చకులు రాజేష్ బట్టర్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించి కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు పట్టణ, మండల పరిధిలోని భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. కార్యక్రమానికి శ్రీశైలం దేవస్థాన చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు, రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్ రాజు, టీటీడీ డిప్యూటీ ఈవోలు ప్రశాంతి, శివప్రసాద్, ఎస్ఈ మనోహర్, సూపరింటెండెంట్ మస్తానయ్య, తాళ్లపాక గ్రామస్థులు ఉద్దండం సుబ్రహ్మణ్యం, జవ్వాజి అదృష్టదీపుడు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐలు నాగార్జున, ప్రసాద్‌బాబు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సబ్సిడీ శనగలకు ఆసక్తి చూపని రైతులు

మార్కెట్ ధరకు, సబ్సిడీ ధరకు వ్యత్యాసం లేకపోవడమే...



శనగ పంట సాగు చేస్తున్న దృశ్యం



శనగ విత్తనాలు

రాజుపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రబీలో ప్రధాన పంటగా సాగు చేసే శనగ రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు అందజేస్తుంది. ఈ ఏడాది సబ్సిడీ శనగలకు రైతన్నలు పెద్దగా మొగ్గు చూపడం లేదు. దీనికి బయట మార్కెట్‌లో లభించే శనగలకు, సబ్సిడీతో అందజేసే వాటి ధరకు తక్కువ వ్యత్యాసం ఉండడంతో రైతులు ఆసక్తి కనబరచడం లేదు. మండలంలో 12వేల ఎకరాల పైబడి శనగపంట సాగు చేసేందుకు రైతన్నలు పంట పొలాలను సిద్ధం చేశారు. అందుకు గాను ప్రభుత్వం 2800 క్వింటాళ్ల శనగ విత్తనాలను మండలానికి అలాట్‌మెంట్ చేసింది. అయితే రైతన్నకు సబ్సిడీ పోను క్వింటా రూ.5800 ధర నిర్ణయించారు. బయట మార్కెట్‌లో కూడా అదే రేటుకు విత్తనాలు దొరుకుతుండడంతో సబ్సిడీ శెనగలకు రైతులు పెద్దగా మొగ్గు చూపడంలేదు. 2800 క్వింటాళ్లకు గాను 600 క్వింటాళ్లకు మాత్రమే రైతులు నమోదు చేసుకున్నట్లు ఏవో శివరామక్రిష్ణారెడ్డి తెలిపారు. తెలిపారు.

ఎట్టకేలకు పింఛన్లు పంపిణీ

సింహాద్రిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మ గూడూరులో ఎట్టకేలకు పింఛను డబ్బులు సోమవారం అధికారులు పంపిణీ చేశారు. వివరాల్లోకెళితే... అంకాళమ్మగూడూరు సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంటు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఈనెల 1వ తేదీ పింఛను డబ్బులు రూ.6లక్షల 25వేలు పెన్షన్‌దారులకు పంపిణీ చేయకుండా పరారైన విషయం పాఠకులకు విదితమే. దీంతో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేశారు. దీంతో స్పందించిన కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ ప్రభుత్వానికి నివేదికలు పంపి పెన్షన్‌కు కావాలసిన నిధులు మంజూరు చేయించినట్లు ఎంపీడీఓ తెలిపారు. పింఛన్లు పంపిణీ చేయడంతో పెన్షన్ దారులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రారంభమైన శాఖల వారీ సమీక్ష

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శాఖల వారీగా సమీక్షలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు సైన్స్ విభాగాలపై జరిగే ఈ సమీక్షల తొలిరోజున కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమేటిక్స్, జియాలజీ శాఖలను ఆయన పరిశీలించారు. విభాగాధిపతులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా తమ శాఖలలో జరుగుతున్న పరిశోధనలు, ప్రాజెక్టులు, పేటెంట్లు, విద్యార్థుల ప్రగతి వివరించారు. శాఖల బలహీనతలు, బలాలను గుర్తించి అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు వైస్ చాన్సలర్ సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, సైన్స్ అకాడమిక్ డీన్ ఆచార్య ఏజీ దాము, ఐక్యూ ఏసీ సంచాలకుడు డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యం శర్మ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థిపై దాడి



గాయపడిన శాంతన్‌రెడ్డి

రాజంపేటటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలో చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థి ఊరగాయల శాంతన్‌రెడ్డిపై కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల వివరాల మేరకు.. రాయచోటి రామాపురానికి చెందిన శాంతన్‌రెడ్డి అన్నమాచార్య యూనివర్శిటీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఏడాది క్రితం శాంతన్‌రెడ్డి, నితిన్ బోయనపల్లిలో ప్రైవేటుగా ఉన్న సమయంలో కొందరు వ్యక్తులు నితిన్‌పై దాడి చేశారు. ఆ దాడిలో శాంతన్‌రెడ్డి పాత్ర ఉందని కక్ష కట్టిన కొందరు వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున రూములోకి వచ్చి అతనిపై దాడి చేసి గాయపరిచారు. గాయపడిన విద్యార్థిని స్థానిక విద్యార్థులు గమనించి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. ఈ దాడిపై మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుందూ వరద ఉధృతికి...

- 690 హెక్టార్లలో పంట నష్టం
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



నీటిలో ఉన్న జొన్న పంట

రాజుపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో ఎగువన కురిసిన వర్షాలకు కుందూ నదిలో భారీగా వరద నీరు ప్రవహించింది. దీంతో నదికి ఇరువైపులా సాగైన పంటలు మునకకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయాధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదకలు పంపారు. ఈ ప్రకారం మండలంలో వరి 28 హెక్టార్లు, పత్తి 19 హెక్టార్లు, కంది 11.50, మినుము 630 హెక్టార్లతో పాటు మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బతిన్నట్లు వచ్చినట్లు గుర్తించారు. అయితే మినుము పంట రబీలో సాగు చేయడంతో ఆ రైతన్నలకు ఉచితంగా 126 క్వింటాళ్ల మినుములు అందిస్తున్నట్లు తెలిపారు. మిగతా 60 హెక్టార్ల పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వీరబల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మాసాపేటలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో పెద్దివీడు రెడ్డివారిపల్లె హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు. అండర్-17 విభాగంలో వెంకట నరసింహ, రాజేశ్, అండర్-14 బేస్‌బాల్‌లో మణికంఠ ప్రతిభ చూపినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతూ విజయకుమార్ (47) అనే వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందాడు. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన రమణ కుమారుడు విజయకుమార్ (47) తరిగొండలోని ఆస్పత్రిలో ఆయుష్ కాంపౌండర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 25న సీటీఎం నుంచి మదనపల్లెకు బైక్‌పై వస్తూ చెట్టుకు ఢీకొని గాయపడ్డారు. అతను తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందా డు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆటో బోల్తా... నలుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి నలుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం టి.రాచపల్లెకు చెందిన సిద్దారెడ్డి (92) అనారోగ్యంతో ఉండడంతో మదనపల్లె ఆస్పత్రికి తరలించడానికి ఆటోలో బయలుదేరారు. ఆరోగ్యవరం వద్దకు చేరకుకోగానే కుక్కలు ఆటోకు అడ్డురావడంతో వాటిని ఢీ కొట్టి ఆటో బోల్తాపడింది. ఈప్రమాదంలో ఆటోలో ఉన్న సిద్దారెడ్డి కుమారై అనసూయమ్మ, మనుమరాలు సాయివాణి ఆటో డ్రైవర్ రెడ్డెప్పరెడ్డి గాయపడ్డారు. వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రోత్సాహం ఉంటే ప్రపంచ దిగ్గజాలు తయారవుతారు



మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ విజేతగా నిలిచిన సందర్భంగా పులివెందులలో నిర్వహిస్తున్న ర్యాలీ

పులివెందుల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో తగిన ప్రోత్సాహం అందిస్తే ప్రపంచ దిగ్గజాలు తయారవుతారని పులివెందుల అర్బన్ ఎస్ఐ సుబహాన్ పేర్కొన్నారు. ప్రపంచకప్ మహిళా క్రికెట్ విజేతగా భారతదేశ జట్టు నిలిచిన సందర్భంగా పులివెందులలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రపంచ మహిళా జట్టు క్రికెట్ విజయం స్ఫూర్తిదాయమన్నారు. ఈ జట్టులో ఉన్న మన కడప జిల్లా ముద్దుబిడ్డ శ్రీచరణికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. శ్రీచరణిని ప్రోత్సహించిన కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనీత, జేవీవీ జాతీయ కార్యదర్శి సనావుల్లా, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.

80 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం

వీరబల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడికోట పంచాయతీ యడబల్లిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులో ఎస్ఐ నరసింహారెడ్డి దాడులు నిర్వహించారు. 80 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని బెల్టుషాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో బాలోత్సవం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల29, 30 తేదీల్లో బాలోత్సవం నిర్వహిస్తున్నామని, ఇది పిల్లల పండుగ కాదని భావి భారత పౌరులపండుగ అని బాలోత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు గోపాల్ తెలిపారు. సోమవారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో బాలోత్సవంపై నెలవారీ సమావేశం జరిగింది. నవంబరు 29, 30 తేదీల్లో మరియాపురం గర్ల్స్ హైస్కూల్లో బాల్సోతవం పండుగ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ కమిటీ గౌరవాధ్యక్షుడు నాగమణిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

'జోగి రమేశ్ అరెస్టు దుర్మార్గం'

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి జోగిరమేష్ అరెస్టు అప్రజాస్వామికమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష విమర్శించారు. సోమవారం కడప నగరం 42వ డివిజన్ రవీంద్రనగర్‌లో రచ్చబండ కార్యక్రమంనిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎస్వీ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి జోగి రమేశ్‌పై కేసు దుర్మార్గమని విమర్శించారు. లిక్కర్ స్కాం చేసిన వాళ్ల మాటల ఆధారంగా రమేశ్‌ను అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమో ప్రజలే నిర్ణయించాలన్నారు.

ఏఐఎస్‌ఏ నిరసన

పులివెందుల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని ఏఐఎస్ఏ పులివెందుల ఏరియా కార్యదర్శి దినేష్ కుమార్ విమర్శించారు. సోమవారం పులివెందుల మెడికల్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో ఏఐఎస్ఏ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్తీక మాస ప్రత్యేక పూజలు



వల్లూరు... పుష్పగిరి కొండపైన దీపాలు వెలిగిస్తున్న మహిళలు, వేంపల్లెలో అన్నదానం చేస్తున్న దృశ్యం

వల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీక రెండో సోమవారం పురస్కరించుకుని భక్తులు పుష్పగిరికి తరలివెళ్లారు. నదిలో పుణ్యాస్నానాదులు ఆచరించి ధ్వజస్తంభం వద్ద పిండి దీపాలను వెలిగించారు. అనంతరం రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వాములను, సంతాన మల్లేశ్వరుని దర్శించుకుని కాయ కర్పూలు సమర్పించారు. అలాగే పుష్పగిరి గ్రామంలో ఉన్న కామాక్షి సమేత వైద్యనాథేశ్వరులకు అభిషేకాలు చేశారు. మండల కేంద్రంమైన వల్లూరులో ఉన్నభవానీ శంకరాలయంలో రుద్రాభిషేకాలను నిర్వహించారు. అమ్మవారికి ఖడ్గమాలతో కుంకుమార్చన చేశారు. పార్వతి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

వీరపునాయునిపల్లె..: మండల పరిధిలోని అనిమెల గ్రామ సమీపంలో లోని సంగమేశ్వర ఆలయం శివనామస్మరణతో మారుమోగింది. కాగా సంగాలపల్లె గ్రామంలో ఉన్న శివకృష్ణ కోసం రక్షణ శాలలో ఈనెల 5వ తేదీ నుంచి కార్తీక ఉత్సవాల్లో భాగంగా కార్తీకపౌర్ణమి సంబరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

వేంపల్లె..:వేంపల్లె బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక మహోత్సవ వేడుకల్లో గౌరీదేవి ఆలయంలో అమ్మ వారిని అన్నపూర్ణేశ్వరీదేవిగా అలంకరించారు. మూడు రోజులుగా కార్తీక మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. రాత్రికి అమ్మవారిని కాశీ అన్న పూర్ణేశ్వరీదేవిగాఅలంకరించి పూజలు చేశారు. ఆలయాల్లో: వేంపల్లె పాపాఘ్ని నదీ ఒడ్డున వెలసిన గవిమల్లేశ్వర ఆలయం, పాతపేట భవాణి నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలుచేశారు. గవిమల్లేశ్వర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

కమలాపురం రూరల్..: కార్తీక సోమవారం సందర్భంగా మడల పరిధిలోని చదిపిరాళ్ల అగస్తేశ్వరాలయంలో కమలాపురం, ఎర్రగుడిపాడు, పెదచెప్పలి శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. చదిపిరాళ్లలో అన్నదానం చేశారు.

చెన్నూరు..: కార్తీక మాసంలో శివాలపల్లె కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రజలు కార్తీకద్వీపాలు వెలిగించి స్వామివారిని దర్శించకున్నారు. పెన్నానదివడ్డున వెలసిన మల్లేశ్వరాలయంలో రుద్రాభిషేకాలు జరిగాయి. రాత్రికి పల్లకీసేవలు నిర్వహించారు.అలాగే ఆర్‌అండ్‌బీ రోడ్డులోని నాగేశ్వరాలయంలో మూలవిరాట్ మూర్తికి ప్రత్యకాభిషేకాలు చేశారు. కైలాసగిరి కోనలో బలసింగాయపల్లెకు చెందిన నేతల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు.

పడకేసిన నగర అభివృద్ధి : సీపీఐ

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అధికార ప్రతిపక్ష నేతల ఆధిపత్య పోరులో నగరాభివృద్ధి కుంటుపడిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర విమర్శించారు. సోమవారం స్థానిక సమస్యలపై సీపీఐ సమరభేరి కార్యక్రమంలో భాగంగానగర సౌత్‌జోన్ పరిధిలోని 13వ డివిజన్ నుంచి 24వ డివిజన్ వరకు ఉన్నవివిధ కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు మునెయ్య, పక్కీరప్ప, చంద్ర, వివిధ డివిజన్ల కాలనీల సీపీఐ కార్యకర్తలు, స్థానికులుతదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటుచేయాలి

కడపనాగరాజుపేట,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్కేనగర్‌లో రోడ్లు, డ్రైనేజీ కాల్వలుఏర్పాటుచేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గసభ్యులు చాపల సుబ్బరాయుడు, లక్ష్మీదేవి కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ వారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రసాద్, తస్లీమ్ పాల్గొన్నారు.

అగ్రిల్యాబ్‌లో ఉచితంగా మొలకల శాతం పరీక్ష

కమలాపురం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని అగ్రిల్యాబ్‌లో రైతులు విత్తన మొలకల శాతం పరీక్షను ఉచితంగా చేయించుకోవచ్చని ఏవో సరస్వతి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కంచన్నగారిపల్లె గ్రామంలో పంట పొలాల్లో వేరుశెనగ, మినుము, పంటలు వర్షానికి బాగా దెబ్బతినడంతో వాటిని పరిశీలించారు. అనంతరం సంబటూరు రైతు సేవా కేంద్ర పరిధిలో విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో ఒక్క ఇల్లూ నిర్మించలేదు'

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి 17 నెలలు అవుతున్న పేదలకు ఒక్క ఇల్లూ నిర్మించకపోవడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి ఇందిరాగాంధీ ప్రాముఖ్య ఇచ్చారన్నారు. ఈ స్ఫూర్తితో 2004 నుంచి 2014 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు దాదాపు 60లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు మంజూరై పట్టాలు పొందిన వారికి ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేస్తాం అని తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. కానీ ఈ హామీలు ఇంత వరకు అమలుకు నోచుకోలేదన్నారు.

'కల్తీ జోగీ.... వాగుడు తగ్గించుకో'

కడప మారుతీనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం కేసులో వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్ సిట్ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు దొరికిపోవడంతో అరెస్ట్ అయినప్పటికీ కూటమి ప్రభుత్వంపై వాగడం విడ్డూరంగా వుందని టీడీపీ తెలుగు వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కడపలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ మద్యాన్ని బలవంతంగా తయారుచేయించి, మందుబాబుల ప్రాణాలను గాలిలో కలిపేసి ఆ నెపాన్ని కూటమి ప్రభుత్వంపైకి నెట్టడం దారుణమన్నారు.

అద్భుతం... మహిళా క్రికెట్ జట్టు విజయం : ఎమ్మెల్యే మాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప మారుతీనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళా వరల్డ్‌కప్ క్రికెట్ ఫైనల్ పోరులో ఇండియా క్రికెట్ మహిళా జట్టు అద్భుత పోరాటపటిమతో సౌత్ ఆఫ్రికా జట్టును ఓడించి విజయం సాధించడం చాలా గొప్ప విషయమని కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి అన్నారు. ఆ మేరకు సోమవారం స్థానిక ద్వారకానగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అందని ద్రాక్షలాగా ఊరిస్తున్న ప్రపంచ మహిళా వరల్డ్‌కప్‌ను ఎట్టకేలకు కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యంలో విశ్వవిజేతగా నిలువడం అద్వితీయమన్నారు. ఇదిలావుండగా ఈ జట్టులోఎర్రగుంట్ల మండలం కలమల్ల ప్రాంతానికి చెందిన శ్రీచరణి టోర్నీ ఆద్యంతం క్రియాశీలక పాత్ర పోషించడం హర్షణీయన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు జిలానీబాష, రెడ్డయ్యయాదవ్, మన్సూర్ అలీఖాన్, తిరుమలేష్, సుబ్బరాయుడు తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలంలో ఉన్న గుంత పూడ్చివేత

అడ్డుకున్న తహసీల్దార్



గుంత చుట్టూ మట్టితోలిన దృశ్యం

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం సమీపంలోని గండిరోడ్డులో పాలిటెక్నిక్ కళాశాల సర్కిల్ వద్ద ప్రభుత్వ స్థలంలో ఉన్నగుంతను పక్కభూమి యజమాని పూడ్చేందుకు ప్రయత్నించగా తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి అడ్డుకున్నారు. జేసీబీలతో మట్టిని గుంతలోకి వేస్తుండడంతో గ్రామస్థుల ఫిర్యాదుతో తహసీల్దార్ వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రభుత్వ స్థలం 20సెంట్లు ఉంది. ఆ స్థలంలో గుంత ఉంది. గుంతను పూడ్చితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ గుంతలో తన సొంత భూమి ఉందని గుంత నీళ్లు పొలంలోకి వస్తున్నందునపూడ్చుతున్నామని తహసీల్దార్‌కు భూమి యజమాని చెప్పగా పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి చెందిన 20సెంట్ల స్థలాన్ని గుర్తించి తర్వాత ఏపనులైనా చేసుకోవచ్చని తహసీల్దార్ స్పష్టం చేశారు.

వృద్ధాశ్రమంలో విద్యార్థినుల సేవలు



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్ పీఓ శచీదేవి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం కోటిరెడ్డి మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగాప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.శచీదేవి ఆధ్వర్యంలో వలంటీర్లు కడప జిల్లా పరిషత్ సమీపంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహాన్ని సందర్శించారు. సేవా కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు వంట సరుకులు, బెడ్‌షీట్లు, టవల్స్ వంటి అవసరమైన వస్తువులను వృద్ధులకు,నిరాశ్రయులకు అందేశారు. అనంతరం వసతిగృహాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ నిర్వాహకుడుశ్రీనివాసులరెడ్డి , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీం బాష పాల్గొన్నారు.

'దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ ముట్టడికి సిద్ధం'

కడప మారుతీనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ నిబంధనలకు తిలోదకాలిచ్చి రెండో ప్లాంట్‌కు సిద్ధపడుతున్న జమ్మలమడుగు మండలం మైలవరంలో గల దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీని ఆ పరిసర గ్రామాల ప్రజలతో కలిసి త్వరలో ముట్టడించబోతున్నట్లు ఆ మండల నవాబుపేట, దుగ్గన పల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి, వినయ్ స్పష్టం చేశారు. సోమవారం వారు కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ కారణంగా ఆ పరిసర గ్రామాల పొలాలు, పంటలు నాశనం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మైలవరం జడ్పీటీసీ మహాలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోండి

కడప కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం నేపథ్యంలో జిల్లాలోని వివిధ శైవ క్షేత్రాలను దర్శించుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గంజి మల్లికార్జునప్రసాద్ సూచించారు. కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా నగర ఆకులవీధిలో వెలసిన రాజరాజేశ్వరీదేవి దేవస్థానంలోని కాశీ విశ్వేశ్వరస్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. దేవాలయాలలో విద్యుత్, నీటి, శానిటేషన్ తదితర సమస్యలు లేకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బీసీలు జనసేనపార్టీలో చేరిక : తుంగా రమణయ్య



పార్టీలో చేరిన వారితో జనసేన నాయకులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రజల కోసంచేస్తున్న మంచి, రాష్ట్రంలో ఆయన శాఖల తరఫున జరుగుతున్న అభివృద్ధి, పార్టీ సిద్ధాంతాలునచ్చి కడపనగరంలోని దాదాపు 50మంది జనసేన పార్టీలో చేరారని కడప జనసేన నాయకుడు తుంగారమణయ్య తెలిపారు. 32వ డిఇజన్ బీసీ సామాజిక వర్గానికి చెందిన 50 మంది జనసేన పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. జనసేన పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ రాయలసీమ జోన్ 1 కో-కన్వీనర్ పంద్రా రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ ,నగర ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్,కడప జనసేన నాయకులు తుంగా రమణయ్య సమక్షంలో బీసీ నేత సంఘపట్నం నవీన్‌కుమార్, అతని అనుచర గణం దాదాపు 50 మంది జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ జిల్లా ప్రచారకమిటీ కన్వీనర్ పత్తి విస్సుమాలే శివ తదితరులుపాల్గొన్నారు.

ప్రాజెక్టులను నీటితో నింపిన ప్రభుత్వం



నీటికి పూజ చేస్తున్న జోగిరెడ్డి

లింగాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) ఆయకట్టు రైతులు సాగుచేసే పంటలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండాప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటం, కృష్ణాజలాలను శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తీసుకువచ్చి జిల్లాలోని ప్రాజెక్టులను నింపడం కూటమి ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి అన్నారు. మండంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న సీబీఆర్ ప్రాజెక్టు వద్ద కార్తీక సోమవారం పురస్కరించుకొని సీబీఆర్ జలాలకు ఆయన జలహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీబీసీ ఈఈ వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, చిన్నకుడాల సొసైటీ అధ్యక్షుడు మాధవరెడ్డి, దొండ్లవాగు నీటి సంఘం అధ్యక్షుడు గురివిరెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్పీలకు పెండింగ్ వేతనాలివ్వాలి



నిరసన తెలుపుతున్న మెప్మాఆర్పీలు

కడప కలెక్టరేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూన సంస్థ (మెప్మా)లో పని చేసే రీసోర్స్ పర్సన్లకు (ఆర్పీ) పెండింగ్‌లో ఉన్న 5 నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకులతో కలిసి ఆర్పీలు నిరసన తెలిపారు.ఈసందర్భంగా ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్‌సెక్రటరీ కేసీ బాదుల్లా,ఆర్పీలు చంద్రకళ,విజయలక్ష్మీ, కళావతి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఆర్పీ యూనియన్ నాయకులు గాయిత్రి,వెంకట సుబ్బమ్మ,సుజాత తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలపై ప్రణాళికలు రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజ్ సమస్యలపై సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలని స్టాండింగ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్‌బేగం చాంబర్‌లో కమిషనర్ మనోజ్‌రెడ్డి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 19 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టగా వాటిలో ఐదు అంశాలను వాయిదా వేసి మిగతా 14 అంశాలనుసభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

కాలుష్యరహిత సమాజం అవసరం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఆరోగ్యకరమైన సమాజం కోసం కాలుష్య రహిత సమాజం ఎంతో అవసరమని అందుకోసం జన విజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి పి.సనావుల్లా, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ యు.శ్రీనీత అభిప్రాయపడ్డారు. స్థానిక జడ్పీ ఉర్దూ హైస్కూల్‌లో 5వ రోజు కాలుష్యనివారణ అనే అంశంపై ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబబిరం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాలనారాయణ, టొబాకో కౌన్సిలర్ సుమలత, టీబీ కౌన్సిలర్ భాగ్యలక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం, రైతు సంఘం నేతలు

కడపసెవెన్ రోడ్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథాతుఫాన్ ప్రభావంతో వరి, అరటి, మినుము,కంది, మొక్కజొన్న, పత్తి, చామంతిపూలు, ఇతర వాణిజ్య పంటలు, ఉద్యానపంటలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగాచూడాలని సోమవారం కడప జిల్లా కలెక్టర్‌కి ప్రజా ఫిర్యాదుల వేదికలో వినతిపత్రం ఇచ్చారు.

పారిశ్రామిక రాయితీలను తక్షణం విడుదల చేయాలి..: రాష్ట్రంలోని దళిత, గిరిజన ఎంఎస్‌ఎంఈ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1200కోట్ల పారిశ్రామిక రాయితీలను తక్షణమే విడుదల చేసే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తెలిపారు. ఈ విషయమై సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఎంఎస్‌ఎంఈలతో కలిసి వినతిపత్రం అందించారు.

శానిటేషన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి..: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో దాదాపు 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్‌ను అకారణంగా తొలగించిన పద్మావతి స్వీపింగ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. ఈ విషయమై కలెక్టర్‌ని కలిసివినతిపత్రం అందించారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్ర జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర కోరారు. అక్టోబరు 22న ప్రారంభమైన ఈ యాత్ర నవంబరు7న కడపలో సభతో ముగుస్తుందని తెలిపారు. సోమవారం కడప నగరం హోచిమిన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తేజ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

6న మండల మీట్

పులివెందుల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం 6వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

కుందూ బ్రిడ్జిపై రాకపోకలు బంద్


బ్రిడ్జి వద్ద మట్టి కుప్ప వేసిన దృశ్యం

చాపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం వద్ద కుందూ నదిపై నిర్మించిన బ్రిడ్జి పై సోమవారం నుంచి అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వరదనీటితో బ్రిడ్జి దెబ్బతిని పిల్లర్లు కుంగిపోయాయి. దీంతో ప్రమాదం జరుగకుండా ప్రొద్దుటూరు రోడ్లు, భవనాల శాఖ అధికారులు బ్రిడ్జికి ఇరువైపుల టిప్పర్‌తో మట్టిని కుప్పలుగా వేశారు.దీంతో వాహనాలు వెళ్లేందుకు వీలులేదని ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.


ప్రొద్దుటూరు ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


చాపాడు: అల్లాడుపల్లెలో గల భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు


మైదుకూరు ముక్కోండ మల్లేశ్వరుడు


జమ్మలముడుగులోని సుందరేశ్వరస్వామి


ప్రొద్దుటూరు: పుష్పాలంకరణలో సైకత లింగం

హరహర మహాదేవ

- భక్తిశ్రద్ధలతో కార్తీక రెండో సోమవార పూజలు
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- వైభవంగా చాపాడులోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి వారి గ్రామోత్సవం
- ఆలయాల్లో కార్తీక దీపోత్సవాలు
- దాతలు, నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానాలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శివునికి ప్రీతికరమైన కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా శివాలయాల్లో భక్తులు హరహర మహాదేవ.. శంభో శంకర... అంటూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారి దర్శనం కోసం భక్తులు తరలి వచ్చి మహాశివుడికి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకత లింగానికి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకత లింగం, నవరత్న లింగం, జలలింగం, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం మహిళలు ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని మొక్కుకున్నారు.

కొండాపురంలో: కార్తీక మాస రెండో సోమవారం పురస్కరించు కుని మండలంలోని శైవ క్షేత్రాల్లో వేకువజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని బాలప్పకోన, మల్లేశ్వరకోన, దొంతికోన తదితర చోట్లకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అలాగే కొండాపురం, గండ్లూరు, సుగుమంచిపల్లె తదితర శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా బాలప్పకోన, మల్లేశ్వరకోనలో అన్నదానం చేశారు.

బి.కోడూరులో: మండల పరిధిలోని మున్నెల్లి గ్రామ సమీపంలో సగిలేటి ఒడ్డున వెలిసిన పురాతన శివాలయంలో కార్తీక రెండో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. మహిళలు తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో పాల్గొ ని దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అక్కడకి వచ్చిన భక్తు లకుతీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మైదుకూరు రూరల్‌లో : హరహర మహాదేవ.. శంభో శంకర... అంటూ భక్తులు స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని చిన్నయ్యగారిపల్లె సమీపంలో వెలసిన ముక్కోండ మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భైర వకోన, తిరుమలనాథస్వామి వనిపెంట చెన్నకేశవస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

బద్వేలుటౌన్‌లో: కార్తీక మాసం రెండో సోమవారా న్ని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయాలు శివనామస్మరణలతో మారుమ్రోగాయి.సోమవారం తెల్లవారుజాము నుంచే మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకొని కార్తీక దీపాలను వెలిగిం చారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించగా భక్తులకు ఆలయకమిటీ వారు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముద్దనూరులో: మండల పరిధి జమ్మలమడుగు రోడ్డులో వెలిసిన దత్తమునేశ్వరస్వామి (మునయ్య కోన)లో కార్తీక రెండో సోమవారం సందర్భంగా మహాదేవుడికి ప్రత్యే అలంకరణ,పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కోనలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి గ్రామోత్సవం

చాపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో రెండవ కార్తిక సోమవారం పురస్కరించుకుని భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారికి వైభ వంగా గ్రామోత్సవం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి అమ్మవార్లరె దర్శించుకున్నారు. స్వామివారిని ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించారు. వీరభద్రస్వామిని, అమ్మవారిని దేవాలయం చుట్టూ ఊరేగింపు జరిపారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రమిదలు వెలిగించి పూజలు చేశారు. ఆ దేవస్థానం చైర్మన్ పెరుగు వీరనారాయణ, ఈవో బాలాజీ శంకర్ భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సర్వమతసత్రంలో, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో, నాయీ బ్రాహ్మణ సత్రంలో, దేవస్థాన భవనంలో భక్తులకు అన్నదానం చేశారు.

కన్యతీర్థంలో ప్రత్యేక పూజలు

జమ్మలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కన్యతీర్థం బ్రాలత్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రెండవ కార్తీక సోమవారం పురష్కరించుకుని పలు గ్రామాల నుంచి భక్తులు ఆలయంలో క్యూ కట్టారు. వచ్చిన భక్తులకు ప్రసాద వినిమయంతోపాటు అన్నదానం చేశారు.

అసైన్‌మెంటు లబ్ధిదారులకు భూములు చూపించాలి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ 1397 సర్వేనెంబరులోని అసైన్‌మెంటు లబ్ధిదారులకు భూములు సర్వే చేసి చూపించాలని సీపీఎం నేతలు కోరారు. ఆమేరకు సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్తీక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ మాట్లాడుతూ 2007లో అప్పటి ప్రభుత్వం భూ పంపిణీలో భాగంగా అసైన్‌మెంటు ద్వారా 1397 సర్వేనెంబరులో నిరుపేదలకు పట్టాలు మంజూరు చేసినా ఇంత వరకు సర్వే చేసి భూములు చూపించలేదన్నారు. సానాగోవిందస్వామి, రెబ్బనరసింహులు, అజయ్‌కుమార్, వెంకటరమణ, లక్ష్మిరెడ్డి, నాగసుబ్బరాముడు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఏపీజీబీ అధికారులు

ఎర్రగుంట్ల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అధికారులు సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలలో భాగంగా మేనేజర్ అబ్దుల్ హుస్సేన్, ఫీల్డ్ ఆఫీసర్ శివ జ్యోతి, ఇతర సిబ్బంది మొక్కలు నాటారు.

వైద్యవిద్యను ప్రైవేటీకరించవద్దు

బద్వేలు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వైద్యకళాశాలలను పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌సిప్‌లో చేర్చడం సరికాదని అలా చేస్తే విద్యార్థి లోకం ఉద్యమాలకు సిద్ధమని ఏఐఎస్‌ఏ కడప కన్వీనరు అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏఐఎస్‌ఏ ఏరియా నాయకులు శంకర్, కార్తీక, సాయి పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినం

బద్వేలు, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహం వద్ద డీవైఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ అధ్యక్షులు మస్తాన్ షరీఫ్, ఓబులేరెడ్డి, ఉపాధ్యక్షులు సుధాకర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: పట్టణంలో డీవైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ముందుగా కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర రెడ్డి విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, పట్టణాధ్యక్షుడు ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు సుబహాన్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

పోరుమామిళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళా క్రికెట్‌లో ప్రపంచకప్ సాధించిన పోరుమామిళ్లలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఎస్ఐ కొండారెడ్డిల తో వెంగమాంబ హైస్కూలు విద్యార్థుల తో కలిసి మహిళా ప్రపంచ కప్ క్రికెట్ విజయం, శ్రీహరి కోట నుంచి శాటిలైట్ ప్రవేశపెట్టినందుకు ర్యాలీ నిర్వహించి సంఘీబావం తెలిపారు.

దాల్మియా బాధితుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దాల్మియా బాధితులు (ఫైల్‌ఫొటో)

జమ్మలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని బాధితులు అధికారులను వేడుకుంటున్నారు. సోమవారం బాధితులు మాట్లాడుతూ దాల్మియా ప్లాంటు విస్తరణ కోసం మార్చి 26వ తేదీన కలెక్టర్ సమక్షంలో ఏర్పాటు చేసిన ప్రజాబిప్రాయ సేకరణలో కలెక్టర్‌కు సమస్యలు పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. అత్యున్నతస్థాయి అధికారులతో మాట్లాడి రాత పూర్వకంగా హామీ తీసుకున్న తర్వాతనే దాల్మియా ప్రాంతంలో పబ్లిక్ హియరింగ్ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆరోజు అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పడం జరిగిందన్నారు. అలుగోగు వంక ద్వారా వరద ప్రవాహానికి దాల్మియా నిర్మించడం దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామాలు ముంపునకు గురవడమేకాక 500 ఎకరాల పంట పొలాలు నష్టం జరుగుతోందన్నారు. ఆ సమస్య పరిష్కారానికి సుమారు 700 మీటర్ల పొడవునా కాలువను తవ్విస్తామని ఆ రోజు కలెక్టర్ బాధితులకు హామీ ఇచ్చారన్నారు. అలాగే దాల్మియా నుంచి వెలువడుతున్న కాలుష్యం వలన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికి ఆ హామీలు నెరవేర్చడంలేదని తెలిపారు. ఈ సమస్యకు సంబందించి మైలవరం మండల జడ్పీటీసీ మహాలక్ష్మి, తలమంచిపట్నం ఎంపీటీసీ బి.ఉదయిని, నవాబుపేట, చిన్నకొమెర్ల, దుగ్గనపల్లి, తలమంచిపట్నం ప్రజలు సమస్యలు పరిష్కరించాలని పత్రికాముఖంగా జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక


విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు

మైదుకూరు నవంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో సమగ్ర సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 వ తేదీన జరిగే స్కిల్ డెవలప్ పోటీలలో పాల్గొనేందుకు మైదుకూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపిక య్యారు. బ్యాంకింగ్ ఫైనాన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ విభాగాలలో వృత్తివిద్యా బోధకుల సమన్వయంతో ఏర్పాటుచేసిన ఈ పోటీలలో ఆయా విభాగాలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇలియాస్ అహమ్మద్ తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి సమష్టిగా కృషి చేసిన ఉపాధ్యాయులు, వృత్తివిద్యా బోధకులు గురుమోహన్, తేజ, మధురిమలను అభినందించారు.

విద్యార్థులు వృత్తివిద్యలో నైపుణ్యం సాధించాలి


ఐటీ విద్యలో విద్యార్థులు సాధించిన నైపుణ్యం ప్రదర్శిస్తున్న దృశ్యం

బద్వేలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రసుత పరిస్థితులలో విద్యార్థులు విద్యతో పాటు పలు నైపుణ్య విద్యలలో రాణించాలని ఒకేషనల్ ఎడ్యుకేషన్ విభాగం ఎలక్ట్రానిక్, ఆటో మోటివ్ విభాగ సిబ్బంది వాసుదేవరెడ్డి, సునీత్ కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఐటీ, ఐటీఈఎస్ విభాగ విద్యార్థులకు అక్షయ్‌కుమార్ మార్గదర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్య విద్యపై ప్రాధాన్యత సాధించడం వల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి , జకరయ్య, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలకు విద్యార్థులు ఎంపిక


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన వెంకటాపురం హైస్కూలు విద్యార్థులు

పోరుమామిళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్కూలు గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్ అండర్ 14 విభాగంలో జడ్పీ హైస్కూలుకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో జశ్వంత్ 200 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానం లావణ్య లాంగ్‌జంప్‌లో మూడో స్థానంలో, అండర్ 17 విభాగంలో శోభనాచారి లంగ్‌జంప్‌లో 3వ స్థానంలో, వెంకటచరణ్ 800 మీటర్ల పరుగుపందెంలో 3వ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా సోమవారం వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థినీ, విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

బద్వేలు చెరువును పరిశీలించిన ఎల్ఎస్‌పీ చైర్మన్


పెద్దచెరువును పరిశీలిస్తున్న ఎల్ఎస్‌పీడ్యాం చైర్మన్

బద్వేలుటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలతో బద్వేలు పెద్దచెరువుకు జలకళ సంతరించడంతో ఎల్ఎస్‌పీడ్యాం చైర్మన్ ఈగ రమణారెడ్డి సోమవారం పరిశీలించారు. వర్షాలతో నియోజకవర్గంలోని పలుచెరువులు నిండు కుండలా దర్శనమిస్తున్నాయి. ఈ తరుణంలో బద్వేలు పెద్దచెరువులో నీరు సమృద్ధిగా ఉండడంతో ఆ నీటిని వృథాకానీయకుం డా కాపాడి పంటకాలువలద్వారా పొలాలకు వెళ్లే విధంగా అధికారులు చర్యలుతీసుకోవాలని సూచిం చారు. రైతులకు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని, ఏదైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలి ఆయన పేర్కొన్నారు.

బి.కోడూరు వద్ద ఎల్ఎస్‌పీ డ్యాం పరిశీలన

బి.కోడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని లోయర్ సగిలేరు ప్రాజెక్టును సోమవారం ప్రాజెక్టు చైర్మన్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది వచ్చారు. వారితో ఆయన డ్యాంలో నీటి మట్టం ఎంత ఉంది, డ్యాం భద్రతను అడిగి తెలుసుకున్నారు. అలాగే దిగువ సగిలేటికి ఎంత నీటిని విడుదల చేశారు, బద్వేలు పెద్దచెరువుకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎస్పీ డ్యాం గేట్లు సక్రమంగా ఉన్నాయా అని, చెరువులకు ఉన్న తూములకు షటర్లు అక్కడక్కడా లేవని వాటన్నింటినీ బిగించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బద్వేలు పెద్దచెరువు కూడా త్వరలో అలుగు పారుతుందని ఎల్ఎస్‌పీ ప్రాజక్టు కింద ఉండే అన్ని చెరువులు పుష్కలంగా నీటితో నిండి ఉన్నాయన్నారు.

శ్మశాన వాటిక కోసం స్థలం ఏర్పాటు చేయండి


తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న నేతలు

ప్రొద్దుటూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని స్వరాజ్యనగర్, సంజీవనగర్ కాలనీల్లో నివశించే మాలమాదిగలకు శ్మశాన వాటిక కోసం స్థలాన్ని చూపించాలని భారతీయ జనతాపార్టీ పట్టణ ఎస్సీమోర్చా సీనియర్ నాయకుడు వై.చలపతిరావు తహసీల్దార్‌ను కోరారు. ఆమేరకు సోమవారం తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటిక లేకపోవడం వలన చనిపోయిన వారిని ఎక్కడ సమాధి చేయాలో తెలియని విపత్కర పరిస్థితులను కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొన్ని వేల మంది జనాభా నివశించే ప్రాంతం కావున తహసీల్దారు కాలనీలను సందర్శించి శ్మశాన వాటికకోసం స్థలాన్ని కేటాయించి మాల మాదిగ ప్రజల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు చంద్రబాబు, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకుడు అఫ్జల్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటవస్తువులు వితరణ


విద్యార్థులకు ఆటవస్తువులను అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

కలసపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరణంవారి పల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆట వస్తువులను ఉచితంగా అందజేశారు. క్యారంబోర్డు, వాలీబాల్, సిప్పింగ్ బాల్స్‌చెస్ తదితర ఆటవస్తువులను సంస్థ వ్యవస్థాపకుడు పాపాజెన్ని రామకృష్ణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతో అవసరమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గానుగపెంట రమణారెడ్డి, ఉపాధ్యాయుడు బాలజోజి, విద్యార్థులు రామకృష్ణారెడ్డిని శాలువ, పూలమాల లతో సత్కరించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్నడీఎల్‌డీవో వెంకటశేషయ్య, ఎంపీడీవో

బ్రహ్మంగారిమఠం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని 11 గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని డీఎల్‌డీవో వెంకటశేషయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సభాభవనంలో ఎంపీడీవో రామచంద్రారెడ్డి అధ్యక్షతన స్వామిత్వ, స్వర్ణ పంచాయతీ కార్యక్రమంపై నూతనంగా పంచాయతీలో చేపట్టబోయే ఆన్‌లైన్ కార్యక్రమాల గురించి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.